క్లుప్తంగా

మడత రాజకీయం చేయడంలో చంద్రబాబు దిట్ట


స్టాలిన్‌బాబు

యలమంచిలి: మడత రాజకీయం చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దిట్ట అని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉచ్చుల స్టాలిన్‌బాబు విమర్శించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఎక్కడ చూసినా మద్యం ఏరులైపారుతోందని, రాష్ట్రం మద్యాంధ్రప్రదేశ్ మారిందని ఆయన ఆరోపించాడు. రాష్ట్ర వ్యాప్తంగా ఏరులై పారుతున్న నకిలీ మద్యంపై చంద్రబాబునాయుడు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నకిలీ మద్యం కేసును కూటమి ప్రభుత్వం, చంద్రబాబు డైవర్షన్ చేస్తున్నారని మండిపడ్డారు. నకిలీ మద్యం కేసును సీబీఐకి అప్పజెప్పి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సీబీఐ విచారణ అయితే కాలయాపన చేస్తారనే సాకుతో చంద్రబాబు సిట్ పేరుతో సాక్షులను ప్రభావితం చేస్తున్నారని స్టాలిన్ ఆరోపించారు. సిట్ పేరుతో జ్యూడిషియల్, పోలీస్ సమక్షంలో జనార్దనరావుతో కట్టు కథను అల్లుతున్నారని విమర్శించారు.

బాధితులకు ఆర్థిక సాయం


ఆర్థిక సహాయం అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు ఆర్థిక సహాయం పేదలకు ఎంతో ఆశరాగా ఉంటుందని హోమియోపతి డాక్టర్ కోసూరి రామకృష్ణ ఆనందరాజు అన్నారు. బుధవారం పెన్మెత్స పార్వతి, పంది ముత్యాలరావు, కుక్కల రాంబాబు ముగ్గురు బాధితులకు రూ. 10 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కన్వీనర్ బుద్దరాజు, కుక్కల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యులకు మద్దతుగా నిరసన


కాళ్ల పిహెచ్సీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైద్య సిబ్బంది

కాళ్ల: తమ న్యాయమైన డిమాండ్లను కూటమి ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ పీహెచ్‌సీ వైద్యులు చేపట్టిన సమ్మెకు వైద్య సిబ్బంది మద్దతు తెలుపుతూ నిరసన వ్యక్తం చేశారు. కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం వైద్య సిబ్బంది నల్ల బ్యాడ్జిలు ధరించుకొని ర్యాలీ చేశారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ జీవో నెంబరు 99ని వెంటనే రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ వైద్యులకు న్యాయం చేయాలన్నారు. అనంతరం నల్ల బ్యాడ్జిలతోనే విధులు నిర్వహించారు. ఈకార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి


భీమవరం తిరుమల కళాశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: బాలికలు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని లక్ష్యసాధనకు నిరంతరం కృషి చేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం భీమవరం తిరుమల కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. యువత సోషల్ మీడియాకు బానిసకావడంతో చదువుపై ఏకాగ్రత తగ్గి చదువులో వెనుకబడుతున్నారనిన ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా వివిధ అంశాలపై నిర్వహించిన పోటీలలో విజేతలకు కలెక్టర్ నాగరాణి చేతుల మీదుగా బహుమతులను అందచేశారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖాధికారిణి డి శ్రీలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి ఇ నారాయణ, ఏపీసీ పి శ్యాంసుందర్, డీఎంహెచ్ఓ జి గీతాబాయి, డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి ఆర్ రాజేష్, డివిఈఓ జి ప్రభాకరరావు పాల్గొన్నారు.

సురక్ష యాప్‌పై అవగాహన

భీమవరం: మద్యం దుకాణాల్లో మద్యం బాటిల్స్‌ను యాప్‌లో స్కాన్‌చేసి మాత్రమే విక్రయాలు చేయాలని భీమవరం ఎక్సైజ్ సీఐ కె బలరామరాజు అన్నారు. భీమవరం ఎక్సైజ్‌స్టేషన్‌లో బుధవారం మద్యంషాపులు, బార్లలో పనిచేసే సిబ్బందికి ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ వాడకంపై అవగాహన కల్పించారు. మద్యం షాపుల్లో ఎంఆర్‌పీ ధరలకే విక్రయాలు చేయాలని బెల్టషాపులు నిర్వహిస్తే సమాచారం ఇవ్వాలన్నారు.

ప్రైవేట్ వాహనాల పార్కింగ్‌తో ఇబ్బందులు

- ఇష్టానుసారం నిలిపి ఉంచుతున్న వైనం
- నిలవడానికి కూడా రోడ్డు లేకుండా చేస్తున్న పరిస్థితి


రైల్వే స్టేషన్ రోడ్డులో ఇష్టానుసారం నిలిపి ఉంచిన ప్రైవేట్ వాహనాలు

నరసాపురం: పట్టణంలోని రైల్వేస్టేషన్‌రోడ్డు టు చిన మామిడిపల్లి, గోదావరిగట్టు లాకురోడ్డు టు స్టీమర్ రోడ్డు ఇలా ఎక్కడపడితే అక్కడ ప్రైవేట్ ట్రావెల్స్ వాహనాలను నిలుపుతున్నారు. దీంతో ప్రజల సొకర్యార్థం వెడల్పుచేసి, అభివృద్ధి చేసిన రోడ్లు ప్రజలకు ఉపయోగపడకుండాపోతున్నాయి. దీంతో నరసాపురం రైల్వే స్టేషన్ రోడ్డులో ట్రాఫిక్ సమస్య నానాటికీ తీవ్రమవుతోంది. వ్యాన్స్‌ను ఇష్టానుసారం రోడ్డుకడ్డంగా నిలిపి ఉంచడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వ్యాన్స్‌ను యజమానులు ఓ పద్ధతంటూ లేకుండా రోడ్డు మీదే నిలిపి ఉంచడంతో సమస్య ఎదురవుతుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ రోడ్డుపై వెళ్లడానికి వాహనదారులు నానా ఇబ్బంది పడుతున్నారు. రైల్వేస్టేషన్ సమీపంలో పరిస్థితి మరింత ఘోరంగా తయారైంది. ఇక్కడ రొయ్యల కంపెనీలకు చెందిన భారీ వాహనాలు, ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు ఇష్టానుసారం నిలిపిఉంచుతున్నారు. వాహనాలను ఇక్కడే రోడ్డు పక్కన నిలిపి కడగుతున్నారు. దీంతో పరిస్థితి అధ్వానంగా తయారైంది. మేదర్ల వంతెన వద్ద నుంచి రైల్వే స్టేషన్‌కి వెళ్లే ఈ రహదారిలో ఒకప్పుడు ఎవరూ వెళ్లేవారు కాదు. అధ్వానంగా ఉండే ఈ రహదారిని 2003 ఈ ప్రాంతం బాగా అభివృద్ధి చెందింది. అప్పటి నుంచి ఈ రహదారిలో రద్దీ పెరిగింది. రైల్వే స్టేషన్‌కు వెళ్లే వారే కాకుండా అటు మొగల్తూరు రోడ్డు నుంచి చిన మామిడిపల్లి మీదుగా మల్లవరం, మత్స్యపురి చుట్టు పక్కల గ్రామాలకు వెళ్లేవారు ఈ రహదారి మీదే ప్రయాణిస్తారు. రోడ్డు పక్కన వాహనాలు పెట్టకుండా చర్యలు చేపడితే ప్రజలకు ఉపయోగంగా ఉంటుందని ప్రజలు పేర్కొంటున్నారు.

ఎక్కడ జాగా ఉంటే అక్కడే..

మొన్నటి వరకూ రైల్వేస్టేషన్‌రోడ్డులోనే నిలిపి ఉంచే బస్సులను ఇప్పుడు చినమామిడిపల్లి వరకూ విస్తరించారు. మత్స్యపురిరోడ్డులో చినమామిడిపల్లి వరకూ బస్సులను నిలిపి ఉంచడం, కడకడం చేస్తున్నారు. ఇక పుష్కరాల్లో ఏకంగా రూ 50 లక్షలతో అభివృద్ధి చేసిన గోదావరి గట్టు లాకు రోడ్డు నిండా ప్రైవేట్ బస్సులే దర్శనమిస్తున్నాయి. ఈ రోడ్డుపై జనం నడిచివెళ్లే వీలు కూడా లేదు. ఇక స్టీమర్‌రోడ్డు పొడవునా కూడా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు నిలిపి ఉంచుతున్నారు. ఈ సమస్యపై ఇటు మునిసిపాలిటీ, అటు పోలీసుశాఖ సంయుక్తంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

కలాంను స్ఫూర్తిగా తీసుకోవాలి

భీమవరం: భారతదేశ మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని భీమవరం పట్టణంలోని కస్తూరిబాభవనంలో మానవతా సంస్థ, సర్వోదయ మండలి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ముందుగా అబ్దుల్ కలాం చిత్రపటానికి మానవతా సంస్థ అధ్యక్షుడు చింతలపాటి రామకృష్ణంరాజు, సర్వోదయ మండలి కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ అబ్దుల్‌కలాం అతి పేద కుటుంబంలో జన్మించినా కష్టపడి ఉన్నత చదువులు చదివి అణు పరిశోధన శాస్త్రవేత్తగా విశిష్ట పరిశోధనలు చేసి, పుస్తకాలు రచన చేశారన్నారు. భారతదేశ రాష్ట్రపతిగా అత్యున్నత సేవలు అందించి భారతరత్న అందుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కలిగొట్ల గోపాలశర్మ, అల్లు శ్రీనివాస్, కారుమూరి నర్సింహమూర్తి బాబు, గ్రంధి కుమార వెంకటేశ్వర వరప్రసాద్, ఇందుకూరి శివాజీ వర్మ, ఎస్‌కే చాన్ బాషా, సీతా రామరాజు, అరవ భాస్కరరావు, దుర్గాదేవి, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణపై సమీక్ష


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కర్రి వెంకటనారాయణరెడ్డి

పెనుమంట్ర: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేసే ఆలోచనలు విరమించుకోవాలని లేకుంటే పేద వైద్య విద్యార్థులకు మద్దతుగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని పెనుమంట్ర ఎంపీపీ కర్రి వెంకటనారాయణరెడ్డి (వాసు రెడ్డి) అన్నారు. బుధవారం మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మాజీమంత్రి చెరుకువాడ శ్రీ రంగనాథరాజు ఆధ్వర్యంలో చేపట్టే కోటి సంతకాల కార్యక్రమం నిర్వహణపై బుధవారం పెనుమంట్ర గ్రామ కమిటీ అధ్యక్షుడు తేతలి సుధీర్ రెడ్డి కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు గూడూరు దేవేంద్రుడు అధ్యక్షతన గ్రామ కమిటీల అధ్యక్షులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వాసు రెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో పేద విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు 17 మెడికల్ కాలేజీలకు అనుమతులు తీసుకువస్తే, నేడు కోటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసి పేదలకు వైద్య విద్యను దూరం చేసే కుట్ర చేస్తుందని మండిపడ్డారు. అలాగే కూటమి ప్రభుత్వం గ్రామాల్లో బెల్ట్ షాపుల ద్వారావిచ్చలవిడిగా నకిలీ కల్తీ మద్యం విక్రయాలు చేయిస్తూ మద్యం ప్రియుల ప్రాణాలు హరిస్తు పేద కుటుంబాల జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బుర్ర రవికుమార్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు దొంగ దుర్గాప్రసాద్, గరు గ్రామ సర్పంచ్ ముదునూరు నాగరాజు, ఆలమూరు ఉప సర్పంచ్ కొవ్వూరు సుబ్బిరెడ్డి గ్రామ కమిటీల అధ్యక్షులు కొవ్వూరు బ్రహ్మేశ్వర్ రెడ్డి, ఈది ప్రవీణ్, కొవ్వూరు వెంకటేశ్వర రెడ్డి, కలిదిండి దినేష్ రాజు, దాట్ల సంటి రాజు, కొనకల భీమేశ్వరరావు, కర్రి గోపాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి


ఆచంట వేమవరం వైఎస్సార్ సీపీ నూతన గ్రామ కమిటీని అభినందిస్తున్న నాయకులు

పెనుగొండ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆచంట వేమవరం గ్రామ అధ్యక్షుడిగా నియమితులైన యడ్ల రామకృష్ణ అన్నారు. నూతనంగా ఎంపికైన కమిటీని బుధవారం గ్రామంలో ఘనంగా సత్కరించారు. యువజన విభాగం అధ్యక్షుడిగా దొంగ ఉపేంద్ర, రైతు విభాగం అధ్యక్షుడిగా గుత్తుల బులి స్వామి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొండేటి జోగేంద్ర, బీసీ సెల్ అధ్యక్షుడిగా గెద్దాడ హరిబాబు, మహిళా విభాగం అధ్యక్షుడిగా కొవ్వుల దేవిలను నియమితులు కావడంతో వారినీ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామ అధ్యక్షుడు యడ్ల రామకృష్ణ మాట్లాడుతూ మాజీ మంత్రిచెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆధ్వర్యంలో పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు. నమ్మకంతో అధ్యక్ష పదవికి ఎంపిక చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనరు జక్కంశెట్టి చంటి, పార్టీ నాయకులు సుంకర సీతారాం, ఉప సర్పంచ్ కొండేటి సురేష్, అరుమిల్లి రామచంద్రరావు, గుత్తుల శ్రీను, విశ్వనాధుల సత్యనారాయణ, బళ్లారి నాగరాజు, కొడమంచిలి రాజు, చదలవాడ సామ్యూల్, మాటూరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి


అబ్దుల్‌కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: భారతదేశ పదకొండో రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపిజే అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమం స్థానిక అబ్దుల్ కలాం పార్కులో బుధవారం ఘనంగా నిర్వహించారు. లజపతి రాయ్‌పేట మాంటిస్సోరి స్కూల్ విద్యార్థులు స్థానిక యడ్లబజార్ సెంటర్‌లో ఉన్న అబ్దుల్ కలాం పార్క్‌ను సందర్శించి అక్కడ ఉన్న కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల డైరెక్టర్ కె.వి కృష్ణవర్మ మాట్లాడుతూ అబ్దుల్ కలాం పేదరికంలో పుట్టినా కృషి పట్టుదలతో అంత ఉన్నతస్థానానికి ఎదిగారని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో చిలుకూరి ప్రసాద్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

నరసాపురం రూరల్: కలాం దేశం గర్వించదగ్గ గొప్ప క్షిపణి శాస్త్రవేత్త అని, కలలు కనండి వాటిని సాకారం చేసుకోండంటూ ఆయన ఇచ్చిన నినాదం యావత్ ప్రపంచాన్ని మేల్కొలిపిందని ప్రధానోపాధ్యాయిని ఉప్పుగంటి రాజశ్రీ అన్నారు. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆమె నరసాపురం మండలంలోని కొప్పర్రు ప్రాథమిక పాఠశాలలో కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలి


సమావేశంలో మాట్లాడుతున్న ముచ్చర్ల త్రిమూర్తులు

నరసాపురం: బ్రిటిష్ ప్రభుత్వంతో కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానానికి తూట్లు పొడుస్తూ, కార్మిక, ఉద్యోగ వర్గానికి కూటమి ప్రభుత్వం అన్యాయం చేస్తుందని సీఐటీయూ నాయకులు విమర్శించారు. బుధవారం స్థానిక మీరా భవన్‌లో సీఐటీయూ పట్టణ ఎనిమిదో మహాసభ నిర్వహించారు. సీఐటీయూ నాయకుడు నోములకొండ ఎండీ బేగం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో త్రిమూర్తులు మాట్లాడుతూ రాష్ట్రంలో కార్మిక, ఉద్యోగ హక్కులు పరిరక్షించి కార్మిక చట్టాలను అమలు చేసి కార్మికులు ఉద్యోగుల సంక్షేమాన్ని కాపాడాల్సిన ప్రభుత్వాలకు వారికున్న హక్కులను హరించే అధికారం ఎవరు ఇచ్చారు? అని ప్రశ్నించారు. అనంతరం 18 మందితో కూడిన నూతన కమిటీని ఎన్నుకున్నారు, సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తెలగం శెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బెనిఫిట్ బజారుపై సమాచారం ఇవ్వాలి


ఆచంట ఎంపీడీఓ కార్యాలయంలో సూపర్‌జీఎస్టీ సమావేశంలో ఎంపీడీఓ కృష్ణమోహన్

పెనుగొండ: భీమవరం జువ్వల పాలెం రోడ్డులో ఏర్పాటు చేసిన సూపర్ జీఎస్టీ బెనిఫిట్ బజారు పై గ్రామాల్లో ప్రతిఒక్కరికీ సమాచారం అందించాలని ఆచంట ఎంపీడీఓ బి.కృష్ణమోహన్ అన్నారు. బుధవారం ఆచంట ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యదర్శులు సచివాలయం కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సచివాలయ పరిధిలో పెండింగ్‌లో ఉన్న సమాచార హక్కు అర్జీలు, ప్రజా సమస్యల పరిష్కార అర్జీలు త్వరగా పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో తాగునీరు పారిశుద్య నిర్వహణలో లోపాలు లేకుండా చర్యలు చేపట్టలన్నారు. సమావేశంలో ఈఓపీఆర్డీ కె.బులి సూరన్న, కార్యదర్శులు చంద్రశేఖర్, దుర్గా ప్రసాద్, గణేష్, ఫణి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఈ రహదారికి మోక్షమెప్పుడో !


సీడీపీఓ కార్యాలయానికి వెళ్లే రహదారి దుస్థితి

పాలకోడేరు: పాలకోడేరు మండలం విస్సాకోడేరు గ్రామంలో ఉన్న ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ కార్యాలయానికి వెళ్లే రహదారి అధ్వాన స్థితిలో ఉంది. ఈ కార్యాలయం జిల్లా కేంద్రమైన భీమవరానికి కూతవేటు దూరంలో ఉండడం గమనార్హం. ఈ కార్యాలయం వీరవాసరం భీమవరం పట్టణం, భీమవరం మండలాల ప్రజలకు సేవలు అందిస్తుంది. ఈ రహదారి 165 జాతీయ రహదారికి 100 మీటర్ల దూరంలో ఉంది. చిన్నపాటి వర్షం వచ్చినా కార్యాలయానికి వెళ్లే రహదారి చిత్తడిగా మారుతుంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఈ రహదారికి మోక్షం కలిగించాలని కోరుతున్నారు.

కుంగిన రోడ్డు.. తప్పిన ముప్పు


రోడ్డు దిగబడి ప్రమాదానికి గురైన ట్రాక్టర్.

నరసాపురం రూరల్: మండలంలోని పాతనవరసపురం గ్రామంలో ప్రధాన రహదారిపై డ్వాక్రా భవనం సమీపంలో ఒక్కసారిగా రోడ్డు కుంగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. బుధవారం యలమంచిలి మండలం బాడవ గ్రామం నుండి ఇటుకల లోడుతో నరసాపురం వైపు వస్తున్న ట్రాక్టర్ రోడ్డు ఒక్కసారిగా కృంగిపోవడంతో ట్రాక్టర్ ట్రక్కు చక్రం వద్ద భారీ గొయ్యి పడటంతో ట్రాక్టర్ ఒక్కసారిగా బోల్తా కొట్టింది. డ్రైవర్, కూలీలు చాకచక్యంగా పక్కనే ఉన్న కాలువలోకి దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. దీంతో భారీ ప్రాణ నష్టం తప్పింది. నరసాపురం నుండి కొత్త నవరసపురం, పాత నవరసపురం వెళ్లే రహదారి అధ్వానంగా ఉన్న విషయం సాక్షి పలుమార్లు వెలుగులోనికి తెచ్చిన విషయం తెలిసిందే. వెంటనే అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు స్పందించి ఈ రహదారి నిర్మాణం చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎరువుల పిచికారీలో జాగ్రత్తలే శ్రీరామరక్ష

క్రిమి సంహారకాల వినియోగంలో అవగాహన అవసరం


మట్లపాలెంలో పురుగుమందు పిచికారీ చేస్తున్న రైతు కూలీ

యలమంచిలి: ఆధునిక వ్యవసాయ విధానంలో దిగుబడులను పెంచుకునేందుకు రసాయన ఎరువులు, క్రిమి సంహారకాల వినియోగం పెరిగిపోయింది. ఎరువులు వేసే సమయంలో, క్రిమి సంహారకాలు స్ప్రే చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని లేదంటే ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు. వాటి వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు, సలహాలు తదితర అంశాలపై వ్యవసాయాధికారులు అవగాహన కల్పిస్తున్నారు. రైతన్నలు అవగాహన పెంచుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా మోనోక్రోటోఫాస్, ఆక్సిడిమోటాన్, మిథైల్, అసిఫేట్ తదితర విషపూరితమైన క్రిమిసంహారక మందులు పిచికారీ చేసే సమయంలో వాటి వినియోగ విధానంపై కచ్చితంగా అవగాహన ఉండాలని సూచిస్తున్నారు.

వినియోగించే పద్ధతులివే

- సస్యరక్షణ చర్యల కోసం వినియోగించే పరికరాలను శుభ్రంగా ఉంచి నీటితో కడిగి, పొడిగుడ్డతో తుడిచి భద్రపరచుకోవాలి.
- మందులు కలపడం, పిచికారీ చేసే సమయంలో దానిపై అవగాహన ఉన్న రైతు సమక్షంలో ఈ ప్రక్రియ చేపట్టాలి.
- ఎక్కువ ఉష్ణోగ్రత, ఎక్కువ గాలి ఉన్న సమయంలో క్రిమి సంహారక మందులను పిచికారీ చేయరాదు.
- పిచికారీ చేసే సమయంలో మద్యం, పొగ తాగడం, పొగాకు నమలడం, గుట్కా, తంబాకు, వంటివి సేవించరాదు.
- కొన్ని రకాల నిషేధిత పురుగు మందులను వినియోగించకూడదు. ఒక్కోసారి ఆయా డీలర్లు వాటిని రైతులకు అంటగట్టే ప్రయత్నం చేస్తుంటారు.
- వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలతో వారు సిఫారసు చేసిన మందులను కొనుగోలు చేయడం ఉత్తమం.

జాగ్రత్తలు వహించాలి



పంటను చీడపీడల నుంచి రక్షించుకునేందుకు క్రిమి సంహారక మందులు వినియోగం తప్పని సరైందే. కాని వాటిని వినియోగించే సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే వాటి ప్రభావం ఆరోగ్యంపై పడే రోగాలకు గురయ్యే ప్రమాదం ఉంది. నిర్లక్ష్యం వహిస్తే ఒక్కోసారి ప్రాణాపాయం ఏర్పడే అవకాశం ఉంది.

– దుంగా బాల త్రిపుర సుందరి, యలమంచిలి మండల వ్యవసాయాధికారి

నేడు నకిలీ మద్యంపై నరసాపురంలో నిరసన

నరసాపురం: రాష్ట్రంలో ఏరులై పారుతున్న నకిలీ మద్యం అరికట్టాలని, ప్రజల పాణాలు కాపాడాలని కోరుతూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎక్సైజ్ సీఐ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు కామన బుజ్జి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉదయం 10 గంటలకు పార్టీ కార్యాలయానికి హాజరు కావాలని కోరారు. అక్కడి నుంచి నిరసన ప్రదర్శనగా వెళ్లి ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతామని స్పష్టం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

నిత్యావసరాల పంపిణీ

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని 12వ వార్డులో నివాసం ఉంటున్న ఓ పేద కుటుంబానికి పాట్నూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు అందించారు. బుధవారం స్థానిక గుత్తులవానిపేటలో సత్యవతి అనే మహిళకు భర్త మరణించగా కుమార్తె మానసిక దివ్యాంగురాలు, కొడుకు పోలియో వ్యాధితో బాధపడుతుండగా ఆర్థికంగా అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈమె కష్టాలను తెలుసుకున్న పాట్నూరి ఫౌండేషన్ సభ్యులు అప్పన్న ఆ కుటుంబానికి 50 కేజీలు బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు అందించారు.

సొసైటీ త్రిసభ్య కమిటీ సమావేశం

పెనుగొండ: రైతులకు అన్ని రకాల సేవలను పెనుగొండ వ్యవసాయ సహకార పరపతి సంఘం ద్వారా అందిస్తూ సొసైటీని అండగా నిలిపినట్లు త్రిసభ్య కమిటీ చైర్మన్ నక్కా వేద వ్యాస శాస్త్రి అన్నారు. బుధవారం సొసైటీ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో సొసైటీ సేవలను వివరించారు. సమావేశంలో వేంద్ర మురళీ, కానూరు వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత వస్తువులను బుక్ చేయకూడదు


బుకింగ్ వివరాలను పరిశీలిస్తున్న ఆర్టీసీ కార్గో ఆర్ ఎం.ఈ మాధవ్

పెనుమంట్ర: బాణసంచా వంటి నిషేధిత వస్తువులను ఆర్టీసీ కార్గో సర్వీస్ ధర బుకింగ్ చేయరాదని ఏపీఎస్ఆర్టీసీ కార్గో ఆర్ఎం ఇ.మాధవ్ అన్నారు. సాధన తనిఖీల్లో భాగంగా గురువారం మార్టేరులోని ఆర్టీసీ కార్గో బుకింగ్ కార్యాలయాన్ని సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి బాణసంచా సామాగ్రి నిషేధిత జాబితాలో ఉన్నందున అటువంటి వస్తువులను ఆర్టీసీ కార్గోలో బుక్ చేయవద్దని . వినియోగదారులు అనుమానిత పార్సిల్ తీసుకువస్తే వారి ఎదురుగానే ఓపెన్ చేసి చూడాలని అందుకు వినియోగదారుడు అంగీకరించకపోతే పార్సిల్స్ బుక్ చేయవద్దని కార్గోపాయింట్ యజమానులకు సూచించారు. ఆంధ్రప్రదేశ్లోని అన్ని ప్రాంతాలతో పాటు తెలంగాణ హైదరాబాద్, సూర్యాపేట, చెన్నై బెంగళూరు గంగావతి వంటి నగరాలకు కూడా ఆర్టీసీ కార్గోల ద్వారా సరుకులు రవాణా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వివాహాది శుభకార్యాల ప్రయాణ అవసరాలకు ఆర్టీసీ బస్సులను వినియోగించుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మార్టేరులో కార్గో పాయింట్‌లను బస్టాండ్ దగ్గరలో ఏర్పాటు చేయాలని కార్గో ఏజెంట్ బాణాల శ్రీనివాసరావుకి సూచించారు.

ఆభరణాల చోరీ

ఉండి: గుర్తు తెలియని వ్యక్తులు తన బంగారు ఆభరణాలు చోరీ చేశారని మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉండి మండలం పాములపర్రు గ్రామ శివారు కొండగూడెం ప్రాంతానికి చెందిన బోణం రామలక్ష్మీ అనే మహిళ ఈ ఏడాది ఆగస్టు 7వ తేదీన బంధువుల ఇంట ఫంక్షన్‌కు వెళ్లి వచ్చి తన బంగారు ఆభరణాలు 3 కాసుల తాడు, అరకాసు సూత్రం బీరువాలో పెట్టింది. వాటిని గతనెల 7వ తేదీన తెలిసిన వారి ఇంట్లో ఫంక్షన్ కొరకు వేసుకుందామని బీరువా తెరిచి చూడగా వస్తువులు కనిపించలేదు. దీంతో గుర్తు తెలియని వారు తన బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు ఏఎస్సై మోహన్ రావు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.